క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలరాజు

విజయనగరం: విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా కె.అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్యను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సహాయ కమిషనర్ కె. అప్పలరాజు మాట్లాడుతూ.. కమిషనర్ పల్లి నల్లనయ్య, సిబ్బంది సమన్వయంతో నగరాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఆదాయ రాబడిపై దృష్టి సారిస్తానని, పన్ను వసూళ్ల లక్ష్యాలను అధిగమించే దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు.

కొప్పెర్ల పార్వతమ్మ జాతర ప్రారంభం

పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కొప్పెర్ల పార్వతమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు ఇనకోటి వంశీయులు తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భారీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం..

విజయనగరం: నగర వీధులతో పాటు శివారు ప్రాంతాలలో పారిశుధ్యం పనితీరు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, పూడికలను ప్రజారోగ్య సిబ్బంది తొలగిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి చెత్త సేకరిస్తున్న నేపథ్యంలో ప్రజలు చైతన్యవంతులై తడి, పొడి చెత్తను వేర్వేరుగా కార్మికులకు అందించాలని సూచించారు.

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ సమస్యను ప్రస్తావించండి..

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో అత్యంత కీలకమైన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిస్థితిపై శాసనసభలో ప్రస్తావించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని విజయనగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. సుగర్ ఫ్యాక్టరీ మూసేయడం వల్ల వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఫ్యాక్టరీ తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రౌతు కనకరాజు, ఆదిబాబు, నర్సిబాబు, ఈశ్వరరావు, జగన్నాథరావు, బంగారయ్య, అప్పలనాయుడు, దాలినాయుడు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పతివాడను కలిసిన స్పీకర్



మాజీ మంత్రి పతివాడ యోగక్షేమాలు తెలుసుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పూసపాటిరేగ: పూసపాటిరేగ మండలం చల్లవానితోటలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడును ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రోతు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

సునీల్‌కుమార్‌ను విమర్శిస్తే సహించం..

విజయనగరం టౌన్: సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను తరుచూ విమర్శిస్తూ కాలక్షేపం చేస్తున్న రఘురామరాజుకు అసలు విమర్శించే అర్హత ఉందా..? అని దళిత సంఘాల జేఏసీ నేతలు మండిపడ్డారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో దళిత సంఘ జేఏసీ నాయకులు పాండ్రంకి వెంకటరమణ, బొంగ భానుమూర్తి, సోము మురళి, తదితరులు మాట్లాడుతూ.. వందల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రామకృష్ణరాజు అసలు చరిత్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. అటువంటి వ్యక్తి సీనియర్ ఐపీఎస్ అధికారిపై బురద జల్లడం సమంజసమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇతరులను విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని డీఈఓ మాణిక్యం నాయుడు సూచించారు. బుధవారం స్థానిక దాసన్నపేట హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారిని సంరక్షించే బాధ్యత లభించడం సిబ్బంది అదృష్టమన్నారు. కార్యక్రమంలో ప్రథమ జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, ఏసీడీపీఓ తవిటినాయుడు, సూపర్‌వైజర్లు అనురాధ, కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

- నిబంధనలు పాటించకుండా విక్రయాలు
- తనిఖీలు చేయని అధికార యంత్రాంగం
- వేసవికి ముందే జోరందుకున్న వ్యాపారం

డబ్బా నీరు సురక్షితమేనా..?



విజయనగరం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనకు సోకే వ్యాధులు అధికంగా మనం తాగే నీటి ద్వారానే సంక్రమిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విషయంలో అవగాహనలేమితో కొందరు, అన్నీ తెలిసి మరికొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వింత వింత వ్యాధుల బారిన పడుతున్నారు. అనుమతుల్లేకుండా ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడం.. తనిఖీలు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం పట్ల సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో వీటి విక్రయాలు ఇప్పటికే జోరందుకున్నాయి. అయితే మనం తాగుతున్న నీరు ఎంత వరకు సురక్షితమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగింది ఆర్‌ఓ ప్లాంట్ నుంచి తీసుకువచ్చిన డబ్బా నీరు అయినప్పటికీ చివరకు డబ్బులిచ్చి రోగాలు కొనితెచ్చుకుంటునట్లుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ నిర్మించేటప్పుడు అసిస్టెంట్ ఫుడ్ సెఫ్టీ కంట్రోలింగ్ అధికారులు, కార్పొరేషన్ నుంచి లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. అధికారులు కూడా వచ్చి అన్నీ సరిగా ఉన్నాయో లేవో చూసుకుని లైసెన్స్ ఇవ్వాలి. కానీ ఇవేవీ జరగడం లేదు. సరైన ప్రమాణాలు పాటించకుండానే ప్లాంట్లు నిర్వహించేస్తున్నారు. అధికారులు తనిఖీలు చేస్తే నిబంధనలకు విరుద్ధంగా వివిధ స్వచ్ఛంధ సంస్థల ముసుగులో నిర్వహిస్తున్న ప్లాంట్‌లు చాలా బయటపడనున్నాయి. ఇదిలా ఉండగా చాలా మంది నిర్వాహకులు ఎటువంటి అనుమతుల్లేకుండానే స్వచ్ఛంధ సేవ ముసుగులో ప్లాంట్‌లు పెట్టి విక్రయాలు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

మినరల్ నీరు అనుకుంటే పొరపాటే

ఆర్‌ఓ ప్లాంట్‌లో అమ్మేది మినరల్ నీరు అని అపోహ పడుతుంటారు. సాధారణంగా నీళ్లలో సోడియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్, పొటాషియం, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి కొన్ని ఖనిజాలను అదనంగా కలిపితే మినరల్ నీరు అంటారు. కానీ ఇవీ కేవలం కొన్ని కార్పొరేట్ కంపెనీలు మాత్రమే పాటిస్తాయి. వీధుల్లో ఉండే ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు చేయలేరు. కార్పొరేషన్ నీటిని కాచి చల్లార్చి వడపోసుకుని తాగడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఆర్‌ఓ ప్లాంట్‌లలో స్టీల్ ట్యాంకులనే వాడాలి. కానీ ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రపరిచి, ఎప్పుడు శుభ్రపరిచారో ట్యాంకుపై రాయాలి. ప్లాంట్‌కు సమీపంలో మురుగు కాల్వలు ఉండకూడదు. అంతేకాకుండా ఆర్‌ఓ ప్లాంట్ పేరిట నీటిని ప్లాస్టిక్ ట్యాంకుల్లో వీధుల్లోకి వెళ్లి అమ్ముతున్నారు. ఆ ట్యాంక్‌లను శుభ్రపరచడం లేదు. డబ్బాలను ఆరు నెలలకు ఒకసారి మార్చి కొత్తవి వినియోగించాలి. కానీ ప్లాంట్ యజమానులు అలా చేయడం లేదు. ఏళ్ల తరబడి అవే డబ్బాలను వాడుతున్నారు. లోపల పాచిపట్టి ఉన్నా శుభ్రం చేయడం లేదు. మూడు అంచెల్లో వాటిని శుభ్రపరచాలి. అలా జరగడం లేదు.

అధికారులు పరిశీలించాలి..

నగరంలోని అన్ని ఆర్‌ఓ ప్లాంట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎక్కడికక్కడే ప్లాంట్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు. ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? నీటి పరీక్షలు చేస్తున్నారా? లేదా? డబ్బాలు ఎలా ఉన్నాయి? చుట్టూ పరిసరాలు ఎలా ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–ఎం.వెంకటేశ్వరరావు, ప్రైవేట్ ఉద్యోగి, విజయనగరం.

● అవగాహన ఫ్లెక్సీలు..



నెల్లిమర్ల మండలంలోని సతివాడ, రామతీర్థం గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఫ్లెక్సీలను స్థానిక ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ స్పీడ్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ఏఎస్సై మూర్తి, కానిస్టేబుల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

● శిక్షణలో నేర్చుకున్న అంశాలు అమలు చేయాలి..



అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాలలో అమలు చేయాలని సమగ్రశిక్ష సీఎంఓ ఆదినారాయణ అన్నారు. మండలంలోని డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వావాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, సీఎంఓ ఆదినారాయణ, ఏఎంఓ ప్రసాద్, ఐఈ కోఆర్డినేటర్ సూర్యారావు, ఎంఈఓ శ్రీరాము బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రీ స్కూళ్లలో చక్కని విద్యా బోధన జరగాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ

● వైద్య పరీక్షలు..



ప్రజలు ప్రతిరోజూ క్రమంతప్పకుండా నడవాలని శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ తిరుపతిరావు అన్నారు. శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్తంగా అయ్యన్నపేట చెరువు వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో బుధవారం వాకర్స్‌కు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులకూ దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మోహనరావు, లిఖిత, ప్రసాద్, ఏఎస్ ప్రకాశరావు మాస్టారు, తాడ్డి ఆదినారాయణ, ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, కోట్ల ఈశ్వరరావు, త్యాడ ప్రసాదరావు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

● ఈ ప్రయాణం తగునా..



జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాలపై ప్రమాదకర ప్రయాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసులు హెచ్చరిస్తున్నా వాహన చోదకులు మాత్రం పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై ఐదుగురు ప్రయాణించడం బుధవారం సాక్షి కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

- కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు



రోటరీ ఎక్స్‌లెన్స్ - 2025 అవార్డు అందుకుంటున్న ఉత్తమ ఉద్యోగులు

విజయనగరం: అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం రోటరీ ఎక్స్‌లెన్స్ - 2025 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. ఉద్యోగం, వృత్తిలో అంకితభావం, చిత్తశుద్ధి తప్పనిసరన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త రవ్వా శ్రీనివాస్, ప్రముఖ వర్ధమాన సినీ సంగీత దర్శకుడు భీష్మారావు కుమారులు సాయి, పవన్‌లకు రోటరీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన, పలు శాఖలకు చెందిన ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, టీఎల్ఎన్ మూర్తి, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- సహితవిద్య జిల్లా సమన్వయకర్త సూర్యారావు



విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న సహిత విద్య జిల్లా సమన్వయకర్త సూర్యారావు

డెంకాడ: విభిన్న ప్రతిభావంతులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో భవిత కేంద్రాలు పనిచేయాలని జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ సిరికి సూర్యారావు అన్నారు. మండల కాంపెక్స్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడి వారి ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులు వారి శక్తిపై వారు నిలబడేలా తయారు చేయాలని సూచించారు. భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల హాజరు శాతాన్ని పెంచాలని ఐఈఆర్‌టీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు బి.రవీంద్ర, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్



కాన్ఫరెన్స్‌కు హాజరైన నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఇతర అధికారులు

విజయనగరం: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కె.సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనట్లయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల పరిస్థితి, పంపింగ్ విధానం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు తలెత్తకూడదని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కె. అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, డీఈలు శ్రీనివాసరావు, ప్రసాద్, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



శివరాత్రి ఏర్పాట్లపై ఈఓకు సూచనలిస్తున్న ఉత్సవ అధికారి ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఉత్సవ అధికారి ఏఎన్‌వీడీ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈఓ వై శ్రీనివాసరావుతో కలిసి క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, భక్తుల అన్నసమారాధనకు జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఉత్సవాలకు విచ్చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

- ఎస్సై గణేష్



బొప్పడాంలో గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: పల్లెల్లో ప్రశాంతమైన వాతావరణానికి ప్రజలు సహకరించాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని బొప్పడాంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమై పలు సూచనలు అందజేశారు. ఇరుగు పొరుగు వాళ్లతో స్నేహపూర్వకంగా మెలిగి ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలన్నారు. క్షణికావేశంలో తగాదాలకు దిగి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. ప్రస్తుతం చట్టాలు కఠినంగా ఉన్నాయని.. కేసుల బారిన పడి ప్రశాంతత కోల్పోవద్దని హితవు పలికారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనవసరపు లింక్‌ల జోలికిపోయి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. అనంతరం బొప్పడాం వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దాడులు సరికాదు..

నెల్లిమర్ల: జర్నలిస్టులపై దాడులు సరికాదని నెల్లిమర్ల ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని ఖండించా రు. ఈ మేరకు తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

భౌతికదాడులు తగవు..

విజయనగరం టౌన్: మక్కువ ప్రజాశక్తి విలేకరి రామారావుపై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు దౌర్జన్యం చేయడాన్ని ఏపీఎఫ్‌టీయూ న్యూ తరఫున రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెహరా శంకరరావు ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టులపై భౌతికదాడులకు పాల్పడడం, అసభ్య పదజాలంతో దూషించడం, చంపేస్తాననడం సరికాదని.. ఇటువంటి సంఘటనలను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

రహదారులను ఆక్రమించరాదు..

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: రహదారులను ఆక్రమించి ఐరన్ బోర్డులు, షెడ్లు వంటివి ఏర్పాటు చేయరాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ప్రణాళికా సిబ్బంది నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి రహదారులను ఆక్రమించి వేసిన షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రహదారులను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని పలుమార్లు సూచించినా, కొంతమంది బేఖాతరు చేస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అటువంటి నిర్మాణాలను తొలగిస్తున్నట్లు తెలిపారు.

పార్కింగ్ స్థలం మంజూరుకు వినతి

విజయనగరం టౌన్: ఆటోల పార్కింగ్‌కు అవసరమైన స్థలం మంజూరు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష్య, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1997 నుంచి ఆటోల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని కోరుతున్నా ఫలితం లేకపోయిందన్నారు. ఇదిలా ఉంటే రెండు నెలలుగా ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న ఆటో స్టాండ్ వద్ద వ్యాపారులతో అనుకూలంగా ఉన్నప్పటికీ, పోలీసులు తమను వేధిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలువురు ఆటో డ్రైవర్లున్నారు.

మందులు తీసుకోవడం కష్టమే..

- సర్వజన ఆస్పత్రిలో ఫార్మసీ వద్ద కానరాని రెయిలింగ్
- రోగులకు తప్పని ఇబ్బందులు
- అవసరం లేని చోట రెయిలింగ్



ఫార్మసీ గది వద్ద మందుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఫార్మసీ వద్ద రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెయిలింగ్ లేకపోవడంతో మందుల కోసం వరుసలో నిరీక్షించే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో అవసరం ఉన్న చోట కాకుండా, అవసరం లేనిచోట అధికారులు రెయిలింగ్ ఏర్పాటు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ప్రతిరోజూ ఓపీకి వెయ్యి నుంచి 1200 మంది వరకు వస్తారు. వీరంతా డాక్టర్లను సంప్రదించి వైద్యసేవల అనంతరం మందుల కోసం ఫార్మసీ వద్దకు వస్తుంటారు. అయితే ఫార్మసీ వద్ద రెయిలింగ్ లేకపోవడంతో ఒకరిని ఒకరు తోసుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. అదే రెయిలింగ్ ఉంటే ఎంతో బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఓపీ స్లిప్పులు ఇచ్చే విభాగం వద్ద అధికారులు రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ ఓపీలు ఇవ్వడం మానేసి ఏడాదైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫార్మసీ వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శన



సాంకేతిక ఆవిష్కరణ ప్రదర్శన

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శన ఆకట్టుకుంది. వినూత్న ఆలోచనలు అనే అంశంపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను ఈ ప్రదర్శనలో ఉంచారు. వ్యవసాయం, వైద్యం, పరిశ్రమలు, తదితర రంగాలలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి కొత్త ఆవిష్కరణలు ఎలా ఉపయోగపడుతాయో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావుకు విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీడీవీ నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'యాక్సిలరేట్ యాక్షన్' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ధూళి కణాల సాంద్రత తగ్గించేందుకు కృషి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తలు డి.సౌమ్య బృంద సభ్యులతో కలిసి మాట్లాడుతున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమంలో భాగంగా ధూళి కణాల సాంద్రత తగ్గించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తలు డి.సౌమ్య బృంద సభ్యులు కమిషనర్ పల్లి నల్లనయ్యను బుధవారం కలిశారు. ఈ మేరకు వారితో కమిషనర్ తన చాంబర్‌లో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత పనులు ఏ స్థాయిలో ఉన్నాయి అన్న విషయాలపై శాస్త్రవేత్తలు ఆరా తీశారు. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వల్ల ఎటువంటి ప్రయోజనం చేకూరిందన్న విషయాలపై ఆరా తీశారు. వాస్తవానికి గత ఆర్థిక సంవత్సరంలో విజయనగరం నగరపాలక సంస్థ కాలుష్య నివారణకై చేపట్టిన విధానాల వల్ల 73 ధూళి కణాలు సాంద్రత ఉన్న నిష్పత్తి 63కు తగ్గిందన్న విషయాన్ని కమిషనర్ నల్లనయ్య శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి ● ఎంపీడీఓ రామకృష్ణ రాజు



వల్లూరు సచివాలయంలో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

నెల్లిమర్ల రూరల్: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు సూచించారు. మండలంలోని సతివాడ, వల్లూరు గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించి వారు చేపడుతున్న విధులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వాళ్లకి అవసరమైన సేవలు అందించాలన్నారు. ప్రజలతో బాధ్యతాయుతంగా మెలగాలని, సమస్యపై వచ్చిన ప్రతి ఒక్కరికీ సంతృప్తికర సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వల్లూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.